సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం
గురువారం । 31 । జూలై । 2025



సగానికి తగ్గిన సోలార్..
రూ.కోట్లతో ఏర్పాటు చేసిన సింగరేణి సోలార్ ప్లాంట్‌లో విద్యుత్ ఉత్పత్తి సగానికి తగ్గిపోయింది. 8లో



డెయిరీకి మహర్దశ
ఖమ్మం విజయ డెయిరీకి మహర్దశ పట్టనుంది. ప్లాంట్ ఆధునికీకరణకు రూ. 2.35 కోట్లు ఇవ్వనున్నారు. 8లో

వాతావరణం
గరిష్టం / కనిష్టం
32° / 25°
జిల్లాలో గురువారం ఉదయం జల్లులు కురిసే అవకాశం ఉంది. మధ్యాహ్నం సాధారణ ఉష్ణోగ్రతలు నమోదవుతాయి.

ఆగస్టు ఆందోళన?

ఏటా ఇదే నెలలో గోదావరి వరదలు
- 2022 జూలైలో మాత్రం మహోగ్రస్థాయి ప్రవాహం
- ముంపు ప్రాంత ప్రజలు, తీర ప్రాంత రైతుల్లో వణుకు
- ఈ ఏడాది జూలై ప్రశాంతమే.. మరి వచ్చే నెల ఎలా ఉంటుందో?



2022 జూలై 16న గోదావరిలో వరద ఉధృతితో భద్రాచలం వద్ద నీటమునిగిన స్నానఘాట్ల ప్రాంతం

భద్రాచలం : ఆగస్టు వస్తుందంటేనే భద్రాచలం ప్రాంతవాసులు తీవ్ర భయాందోళన చెందుతారు. ఈ నెలలోనే ఎక్కువసార్లు గోదావరి వరదలు ముంచెత్తగా నదీ తీర ప్రాంతాల ప్రజలు తీవ్రంగా నష్టపోయారు. ఇళ్లు నీట మునగడంతో కట్టుబట్టలతో పునరావాస కేంద్రాల్లో తలదాచుకున్నారు. పంటలు దెబ్బతిని రైతులు కోలుకోలేని దుస్థితిని ఎదుర్కొన్నారు. గత రెండేళ్లుగా జూలైలోనూ వరదలు ముంచెత్తుతున్నాయి. ఈ ఏడాది జూలై ప్రశాంతంగానే ముగిసింది. జూన్‌లో గోదావరి నీటిమట్టం కొంత పెరిగినా మొదటి ప్రమాద హెచ్చరిక వద్దనే ఆగడంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. 2022 జూలైలో 71.6 అడుగుల మేర గోదావరి ఉప్పొంగింది.

ఆగస్టులోనే అత్యధిక ప్రమాద హెచ్చరికలు
కేంద్ర జలవనరుల శాఖ గోదావరి నీటి ప్రవాహాన్ని లెక్కిస్తుంది. ఆ నివేదిక ప్రకారం మొదటి, రెండో ప్రమాద హెచ్చరికలు ఇప్పటివరకు ఆగస్టులోనే అత్యధికంగా సంభవించాయి. గోదావరి ఏజెన్సీ చరిత్రలో ఇప్పటివరకు అత్యధికంగా 75.6 అడుగుల మేర ముంపు వచ్చింది కూడా 1986 ఆగస్టు 16వ తేదీనే. 1990 ఆగస్టు 4వ తేదీన 70.8 అడుగులుగా నమోదైంది. గోదావరి పరీవాహక ప్రాంతాలతోపాటు ఛత్తీస్‌గఢ్, ఏపీలో భారీ వర్షాలు ఉంటే గోదావరి ఉధృతంగా ప్రవహిస్తుంది. ఈ నేపథ్యంలో అధికారులు ఈ ఏడాది ముందస్తు ఏర్పాట్లు చేశారు. కరకట్ట స్లూయిజ్‌ల వద్ద భారీ మోటార్లు, జనరేటర్లు, పునరావస శిబిరాలు, బఫర్ స్టాక్‌లతో అప్రమత్తంగా ఉన్నారు.



గోదావరి వరదలకు నీటమునిగిన చేలు (ఫైల్)

గోదావరి వరదల తర్వాతనే సాగు..
గోదావరి వరదలంటే ముంపు గ్రామాల ప్రజలతోపాటు ఏజెన్సీలోని రైతులు వణికిపోతారు. 2022 జూలైలో సంభవించిన వరదలతో అధికారిక లెక్కల ప్రకారమే 10,831 ఎకరాలకు పంట నష్టం వాటిల్లింది. గోదావరి వరదల తర్వాతే తీర ప్రాంత రైతులు రెండు సీజన్లలో పంటలు సాగు చేస్తుంటారు. ప్రధానంగా వెంకటాపురం, వాజేడు, దుమ్ముగూడెం మండలాల్లో, పాక్షికంగా పినపాక, మణుగూరు, బూర్గంపాడు మండలాల్లో రైతులు పంటలు సాగు చేస్తారు. వర్షాకాలం సీజన్ ఆగస్టు, సెప్టెంబర్ నెలలు పూర్తయ్యే వరకు పనులను వీరు పూర్తిగా ప్రారంభించరు. ఈ ఏడాది జూలైలో వరదలు లేకపోవడంతో ముందస్తు సాగుకు ఉత్సాహం చూపుతున్నా ఆగస్టులో గోదావరి వరదలు ఏం చేస్తాయోనని భయపడుతున్నారు.

ఊహించని ఉప్పెన..
భద్రాచలం ఏజెన్సీలో గోదావరి వరదలంటే సాధారణంగా ఆగస్టు, సెప్టెంబర్‌లో వస్తాయని అందరూ భావిస్తారు. 2022కు ముందు జూన్, జూలై నెలల్లో వరదలు వచ్చినా పెద్దగా ప్రమాదాలు నమోదు కాలేదు. కానీ 2022 జూలైలో వచ్చిన ఉప్పెన అందరి అంచనాలనూ తలకిందులు చేసింది. జూలై 16, 17 తేదీల్లో వచ్చిన వరద ఏజెన్సీవాసులను అతలాకుతలం చేసింది. 71.3 అడుగులుగా నమోదై 32 ఏళ్ల రికార్డును అధిగమించింది. 1986 తర్వాత ఇదే అత్యధిక గోదావరి వరద ముంపుగా నమోదైంది. 2023, 24 జూలై నెలల్లోనూ 50 అడుగులకు పైగానే వరద ప్రవాహం వచ్చింది.

న్యూస్‌రీల్

సింగిల్ విండోలో హెచ్‌టీ సర్వీసులు..

ఎన్పీడీసీఎల్ ఎస్ఈ మహేందర్

సూపర్‌బజార్(కొత్తగూడెం): విద్యుత్ వినియోగదారులకు హెచ్‌టీ 11 కేవీ, 33కేవీలతోపాటు ఆపైన ఓల్టేజీ సర్వీసుల మంజూరు వేగవంతం చేయడానికి సింగిల్ విండో వ్యవస్థ అందుబాటులోకి తెచ్చినట్లు ఎన్పీడీసీఎల్ ఎస్ఈ మహేందర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఇందుకోసం సర్కిల్ కార్యాలయం, కార్పొరేట్‌లో మానిటరింగ్ సెల్‌ను ఏర్పాటు చేస్తామని తెలిపారు. 11కేవీ దరఖాస్తులను సర్కిల్ ఆఫీస్ ఏడీఈ కమర్షియల్ అధికారి మానిటరింగ్ చేస్తారని, 33 కేవీ, ఆపైన ఓల్టేజీ దరఖాస్తులను ఏడీఈ కమర్షియల్ కార్పొరేట్ ఆఫీస్ అధికారి మానిటరింగ్ చేస్తారని వివరించారు. వినియోగదారులు టీజీ ఎన్పీడీసీఎల్ పోర్టల్‌లో అవసరమైన పత్రాలతో హెచ్‌టీ దరఖాస్తులు (టీజీ ఐపాస్‌లో నమోదు కాని) చేసుకోవాలని సూచించారు. లోకేషన్‌ను సందర్శించాక 33 కేవీ, ఆపైన ఓల్టేజీ ఎస్టిమేట్లకు కార్పొరేట్ అధికారులు అనుమతులు ఇస్తారని తెలిపారు. 11 కేవీ ఓల్టేజీ దరఖాస్తులు పరిశీలించి ఫీజిబిలిటీ ఉంటే రెండు రోజుల్లో అప్‌లోడ్ చేస్తారని పేర్కొన్నారు. వివిధ కారణాలతో సాధ్యపడకపోతే రెండు రోజుల్లో ఆ సూచనలను వినియోగదారునికి ఎస్ఎంఎస్ ద్వారా పంపుతామని వివరించారు. సింగిల్ విండో ద్వారా త్వరితగతిన సర్వీసులు మంజూరవుతాయని వివరించారు.

ఆరోగ్య భరోసా కల్పించాలి



సిబ్బందికి సూచనలు చేస్తున్న డీఎంహెచ్‌ఓ

కరకగూడెం: ఆశ కార్యకర్తలు ప్రతీ ఇంటిని సందర్శించి ఆరోగ్య భరోసా కల్పించాలని డీఎంహెచ్‌ఓ డాక్టర్ జయలక్ష్మి ఆదేశించారు. బుధవారం ఆమె కరకగూడెం, పినపాక, జానంపేట పీహెచ్‌సీలను తనిఖీ చేశారు. రికార్డులు, ఫార్మసీ, ప్రసూతి విభాగాలను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వర్షాకాలంలో ప్రబలే సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రోగులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. అనంతరం కరకగూడెం మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీతో పాటు పినపాకలోని ఉమేష్ చంద్రనగర్ గొత్తికోయ గ్రామంలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాలను సందర్శించారు. వైద్యాధికారులు ఎండీ ఫైజ్ మోహియుద్దీన్, రవితేజ, కారం మధు, దుర్గా భవాని, సిబ్బంది కృష్ణయ్య పాల్గొన్నారు.

ఉద్యాన పంటల సాగు లాభదాయకం



మొక్కలు పంపిణీ చేస్తున్న శాస్త్రవేత్త సుచిత్ర

అశ్వారావుపేటరూరల్: ఉద్యాన పంటల్లో అంతర పంటలు సాగు చేయడం లాభదాయకమని, సన్న, చిన్న కారు రైతులు తప్పనిసరిగా వీటిని సాగు చేయాలని సెంట్రల్ తెలంగాణ జోనల్ హెడ్, సంగారెడ్డి ఫల పరిశోధన స్థానం సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ వి.సుచిత్ర సూచించారు. బుధవారం అశ్వారావుపేట ఉద్యాన పరిశోధన స్థానం వద్ద భారతీయ చిరు ధాన్యాల పరిశోధన సంస్థ సహకారంతో షెడ్యూల్ కులాల రైతులకు ఉద్యాన పంటలపై శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె పామాయిల్ తోటల్లో అంతర పంటల సాగు, చీడ పీడల నివారణపై అవగాహన కల్పించారు. అనంతరం రైతులకు మామిడి, సపోటా, పనస మొక్కలను పంపిణీ చేశారు. శాస్త్రవేత్తలు విజయ్ కృష్ణ, భరత్, ప్రొఫెసర్లు రవికుమార్, నీలిమ, మౌనిక, విజయ్‌తోపాటు వేణు, శివరామ ప్రసాద్ రవీంద్ర, హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

పీఏఐపై జెడ్పీ సీఈఓ సమీక్ష

ములకలపల్లి : మండల పరిషత్ కార్యాలయాన్ని జెడ్పీ సీఈఓ నాగలక్ష్మి బుధవారం సందర్శించారు. రికార్డులను పరిశీలించారు. జీపీల పరిధిలో గత 15 రోజులుగా సేకరిస్తున్న పంచాయతీ అడ్వాన్స్ ఇండెక్స్ (పీఏఐ)పై కార్యదర్శులతో సమీక్ష నిర్వహించారు. ప్రభుత్వ శాఖలకు సంబంధించిన సమగ్ర వివరాలతో రూపొందించనున్న పీఏఐ వివరాల సేకరణలో అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. సకాలంలో పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. ఎంపీడీఓ సత్యనారాయణ, జీపీ కార్యదర్శులు పాల్గొన్నారు.

స్వచ్ఛమైన తాగునీరు అందించాలి

కలెక్టర్ జితేష్ వి.పాటిల్



మిషన్ భగీరథ నీటి శుద్ధి కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ జితేష్ వి.పాటిల్

పాల్వంచరూరల్: ప్రజలకు స్వచ్ఛమైన తాగునీటిని సరఫరా చేయాలని కలెక్టర్ జితేష్ వి.పాటిల్ ఆదేశించారు. మండల పరిధిలోని తోగ్గూడెం మిషన్‌భగీరథ నీటి శుద్ధి కేంద్రాన్ని బుధవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వానాకాలంలో నీటి కాలుష్యం పెరుగుతుందని, నీటి శుద్ధి పరీక్షలు నిర్వహించి పరిశుభ్రమైన నీటినే పంపిణీ చేయాలని అన్నారు. వాటర్ ఫిల్టర్ బెడ్ భవనంపై సోలార్ వ్యవస్థ ఏర్పాటుకు ప్రణాళికలు రూపొందించాలన్నారు. ఆవరణ ఖాళీ ప్రదేశంలో మొక్కలను నాటాలని ఆదేశించారు.

జగన్నాథపురం పీహెచ్‌సీ తనిఖీ
జగన్నాథపురం పీహెచ్‌సీని కలెక్టర్ జితేష్ వి.పాటిల్ ఆకస్మిక తనిఖీ చేశారు. ఆస్పత్రికి చిన్నపిల్లలతో వచ్చిన తల్లులతో పలువురు, పేషెంట్లతో కలెక్టర్ మాట్లాడారు. అనంతరం లోపల గదులను పరిశీలించి ఆస్పత్రి డాక్టర్ రాజుతో మాట్లాడి ఆస్పత్రి స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు. ఆస్పత్రి భవన నిర్మాణానికి ప్రతిపాదనలు పంపాలని డాక్టర్‌ను ఆదేశించారు. ఈ కార్యక్రమాల్లో మిషన్ భగీరథ ఈఈ నళిని, డీఈ సాయి, ఏఈ వెంకటేశ్, తహసీల్దార్ దారా ప్రసాద్ పాల్గొన్నారు.

విద్యతోనే ఉన్నతస్థానం

భద్రాచలం ఐటీడీఏ పీఓ రాహుల్



కొండతోగులో మాట్లాడుతున్న ఐటీడీఏ పీఓ రాహుల్, పక్కన ఎమ్మెల్యే జారె ఆదినారాయణ

అశ్వారావుపేటరూరల్: ఎవరైనా విద్యతోనే ఉన్నత స్థానాలను పొందుతారని భద్రాచలం ఐటీడీఏ పీఓ బి.రాహుల్ అన్నారు. బుధవారం అశ్వారావుపేట మండలం కొండతోగు గిరిజన గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో ఐటీడీఏ ద్వారా ఏర్పాటు చేసిన జీపీఎస్ పాఠశాలను ఎమ్మెల్యే జారె ఆదినారాయణతో కలిసి పునఃప్రారంభించారు. ఈ సందర్భంగా పీఓ మాట్లాడుతూ కొండతోగు గిరిజన పిల్లలు మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్న పండువారిగూడెం పాఠశాలకు వాగు, అడవి దాటి వెళ్తున్నారని, దీంతో గ్రామంలోనే పాఠశాల ఏర్పాటు చేశామని తెలిపారు. కొత్త భవనం నిర్మించే దాకా అంగన్‌వాడీ కేంద్రంలోనే విద్యార్థులకు బోధన అందిస్తామన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ తల్లిదండ్రులు పిల్లలను క్రమంతప్పకుండా బడికి పంపించాలని సూచించారు. అనంతరం విద్యార్థులకు నోట్ బుక్స్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ అప్పారావు, ఐటీడీఏ డీడీ మణెమ్మ, ఏసీఎంఓ రమేష్, ఏటీడీఓ చంద్రమోహన్, ఎంఈఓ ప్రసాద్‌రావు, కాంగ్రెస్ నాయకులు తుమ్మా రాంబాబు, జూపల్లి రమేష్, సుంకవల్లి వీరభద్రరావు పాల్గొన్నారు.

ఆశ్రమ పాఠశాలలో పీఓ తనిఖీ
దమ్మపేట : మండల పరిధిలోని దుర్గం గొల్లగూడెం బాలికల ఆశ్రమ పాఠశాలలో భద్రాచలం ఐటీడీఏ పీఓ బి.రాహుల్ బుధవారం తనిఖీ చేశారు. విద్యార్థులతో కలిసి మధ్యాహ్నం భోజనం చేశారు. విద్యార్థులతో మాట్లాడి సౌకర్యాలపై ఆరా తీశారు. పాఠశాలలో కిచెన్, డార్మెటరీ, నర్సింగ్ గది, తరగతి గదులను పరిశీలించారు. పాఠశాల ప్రాంగణంలో మొక్క నాటి, నీరు పోశారు. అంకంపాలెం ఆశ్రమ పాఠశాలలో పదో తరగతి చదివి, బాసర ట్రిపుల్ ఐటీలో ప్రవేశం పొందిన ఇర్పా కావ్యను శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో డీడీ మణెమ్మ, ఏటీడీఓ చంద్రమోహన్, హెచ్ఎంలు చంద్రకళ, శారద, డిప్యూటీ వార్డెన్లు శ్యామల, నాగమణి తదితరులు పాల్గొన్నారు.



దమ్మపేట: దుర్గంగొల్లగూడెం ఆశ్రమ పాఠశాలలో విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న పీఓ రాహుల్

మెనూ పక్కగా అమలు చేయాలి
ములకలపల్లి: హాస్టళ్లలో మెనూ పక్కాగా అమలు చేయాలని ఐటీడీఏ పీఓ రాహుల్ సూచించారు. మండల కేంద్రంలోని గిరిజన సంక్షేమ బాలుర వసతి గృహాన్ని బుధవారం ఆయన తనిఖీ చేశారు. వసతి గృహ పరిసరాలను, డార్మెటరీలను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. ట్రైబల్ వెల్ఫేర్ డీడీ మణెమ్మ, ఏసీఎం రమేశ్, వార్డెన్ రాంబాబు ఉన్నారు.

పల్లెల్లో స్వచ్ఛత సర్వే

- ఆదర్శ గ్రామాల్లో కేంద్ర బృందం పర్యటన
- క్షేత్రస్థాయిలో పరిశీలిస్తూ వివరాల నమోదు
- ఉత్తమ గ్రామాలకు ర్యాంకులు, పురస్కారాలు
- గతంలో జాతీయస్థాయిలో అవార్డులు కైవసం



చంద్రుగొండ మండలం గుర్రాయిగూడెం గ్రామంలో వివరాలు సేకరిస్తున్న అధికారులు

చుంచుపల్లి: స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ్–2025లో భాగంగా పారిశుద్ధ్య నిర్వహణ మెరుగుపరిచేందుకు గ్రామాల్లో కేంద్ర బృందం సర్వే నిర్వహిస్తోంది. ఎంపిక చేసుకున్న ఆదర్శ గ్రామాల్లో క్షేత్రస్థాయిలో పర్యటిస్తోంది. గ్రామాల పరిధిలో చెత్త సేకరణ తీరు, పారిశుద్ధ్య సిబ్బంది, చెత్త తరలింపు, మరుగుదొడ్ల నిర్వహణ, ప్రభుత్వ సంస్థల పనితీరు తదితర అంశాలపై నేరుగా ప్రజలతో మాట్లాడి పూర్తిస్థాయిలో వివరాలు సేకరిస్తోంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమన్వయంతో స్వచ్ఛభారత్ మిషన్ గ్రామీణ్ ద్వారా మార్పు వైపు అడుగులు వేశాయి. కేంద్ర గ్రామీణ తాగునీరు, పారిశుద్ధ్య మంత్రిత్వ శాఖ నేతృత్వంలో స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ్ ద్వారా ప్రతి ఏడాది గ్రామాల స్థాయిని అంచనా వేస్తున్నారు. గుణాత్మక, పరిమాణాత్మక మార్పు లక్ష్యంగా మెరుగైన పారిశుద్ధ్య ప్రమాణాలను పరిగణనలోకి తీసుకుని వివిధ స్థాయిల్లో ర్యాంకులను కేటాయిస్తున్నారు. ఇందులో భాగంగానే 2025–26 సంవత్సరానికి స్వచ్ఛ సర్వే ప్రక్రియను జిల్లాలో తాజాగా చేపట్టారు. నాలుగు రోజులుగా కేంద్ర బృందం జిల్లాలోని ఆదర్శ గ్రామ పంచాయతీల్లో పర్యటిస్తోంది. ర్యాండమైజేషన్ పద్ధతిలో 20 గ్రామాల్లో క్షేత్రస్థాయి పరిశీలన చేస్తున్నారు. ఒక్కో గ్రామంలో ఇళ్లు, ప్రజా ఉపయోగ స్థలాలు, కంపోస్టు షెడ్లు, ఇంకుడు గుంతలు, మరుగుదొడ్ల నిర్వహణ, మురుగు నీటి వ్యవస్థలను పరిశీలిస్తూ స్వచ్ఛతపై నిర్ధారణకు వస్తున్నారు. పంచాయతీలు, ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, మార్కెట్, ప్రార్థనా ప్రదేశాలను ప్రత్యక్షంగా పరిశీలిస్తున్నారు. 2022–23లో జాతీయస్థాయిలోని సౌత్‌జోన్ విభాగంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మూడో స్థానంలో నిలిచి ఉత్తమ అవార్డు సాధించింది.

క్షేత్రస్థాయిలో పరిశీలిస్తున్న బృందం
కేంద్ర బృందం ముందస్తు సమాచారం ఇవ్వకుండా ఆన్‌లైన్‌లో నమోదు చేసిన వివరాల ఆధారంగా ఎంచుకున్న గ్రామాలకు వెళ్లి పరిశీలిస్తున్నారు. పారిశుద్ధ్య స్థితి, ప్రగతి పనులపై సర్వే నిర్వహిస్తున్నారు. గ్రామాల్లో చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను పరిగణనలోకి తీసుకుని మార్కులు కేటాయిస్తున్నారు. నాలుగు రకాల అంశాలను విభజించి 1000 మార్కులకు అంచనా వేస్తోంది. సేవాస్థాయి పురోగతికి 240 మార్కులుంటాయి. ఘన, ద్రవ పదార్థాల నిర్వహణ, గ్రామాల్లో స్వచ్ఛత స్థితి ప్రత్యక్ష పరిశీలనకు 540 మార్కులు కేటాయించారు. వ్యర్థాల నిర్వహణ కేంద్రాల ప్రత్యక్ష పరిశీలనకు 120 మార్కులు కేటాయించారు. ప్రజాభిప్రాయ సేకరణకు మరో 100 వరకు మార్కులున్నాయి. ఇళ్లలో మరుగుదొడ్లు అందుబాటులో ఉన్నాయా లేవా, బహిరంగ మలవిసర్జన చేసే ప్రాంతాలున్నాయా, ఘన వ్యర్థాల రవాణాకు ఎలాంటి ఏర్పాట్లు చేశారు, ఇంటింటి నుంచి చెత్త సేకరణ జరుగుతుందా లేదా, ఐదేళ్లలో గ్రామంలో పారిశుద్ధ్య పరిస్థితుల్లో మార్పులేమైనా వచ్చాయా, లేదా భవిష్యత్తులో కార్యక్రమాల నిర్వహణపై ప్రజల నుంచి అభిప్రాయాలను సేకరిస్తున్నారు. అనంతరం సర్వేలో తెలిన అంశాల నివేదికలను కేంద్ర ప్రభుత్వానికి పంపుతారు. ఎక్కువ మార్కులు సాధించిన గ్రామాలకు ర్యాంకులు కేటాయించి నగదు పురస్కారాలు అందజేస్తారు.

సర్వే చేపడుతున్నారు..



జిల్లాలో స్వచ్ఛ సర్వేక్షణ్ సర్వే కొనసాగుతోంది. ఇందుకోసం క్షేత్రస్థాయిలో కేంద్ర బృందం పర్యటించి ఆదర్శ గ్రామాల్లో పారిశుద్ధ్య నిర్వహణను పరిశీలిస్తోంది. అత్యధిక మార్కుల సాధనకు సమష్టిగా కృషి చేయాలి. ప్రత్యక్షంగా సాగే అభిప్రాయ సేకరణకు గ్రామ ప్రజలు తోడ్పాటును అందించి ఉత్తమ పంచాయతీల ఎంపికకు సహరించాలి.
– ఎం.విద్యాచందన, డీఆర్‌డీఓ

ప్రశాంతినగర్‌లో స్వచ్ఛ సర్వేక్షన్..



గ్రామపంచాయతీలో సర్వే చేస్తున్న కేంద్ర బృందం

కొత్తగూడెంఅర్బన్: లక్ష్మీదేవిపల్లి మండలంలోని ప్రశాంతినగర్ గ్రామపంచాయతీలో స్వచ్ఛ సర్వేక్షన్ గ్రామీణ సర్వే–2025 బుధవారం జరిగింది. కేంద్రబృందం సభ్యులు డంపింగ్ షెడ్, అంగన్వాడీ సెంటర్, ప్రైమరీ స్కూలు, టెంపుల్, గ్రామ పంచాయతీ కార్యాలయం, డ్రెయినేజీ అండ్ సోక్ పిట్, ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఓసీ సామాజిక వర్గాల వారీగా కొన్ని ఇళ్లను పరిశీలించారు. తడి, పొడి చెత్త వేరు చేసే విధానాన్ని, ప్లాస్టిక్ వ్యర్థాల చలనా రిజిస్టర్‌ను పరిశీలించారు. గ్రామ పంచాయతీ రిజిస్టర్లను తనిఖీ చేశారు. కేంద్రబృందం సభ్యులు కె. జయంత్, రేవతి, ఎంపీడీఓ అంకుబాబు, సిబ్బంది కృష్ణ ,సత్యనారాయణ, వీరన్న పాల్గొన్నారు.

జిల్లాలో మండలాలు	గ్రామ పంచాయతీలు	నివాసాలు	జనాభా	మరుగుదొడ్లు	కంపోస్టు షెడ్లు	ఇంకుడుగుంతలు
22	481	2,70,856	8,07,265	2.57 లక్షలు	481	1.35 లక్షలు

‘సీతారామ’లో జిల్లాకు అన్యాయం

- బీఆర్ఎస్ హయాంలో కాంట్రాక్టర్లకే మేలు
- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు



మాట్లాడుతున్న రాంచందర్‌రావు

భద్రాచలం/పాల్వంచ రూరల్/ఇల్లెందు : సీతారామ ప్రాజెక్ట్‌లో జిల్లాకు అన్యాయం చేశారని, ముఖ్యంగా ఇల్లెందుకు తీరని అన్యాయం చేశారని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్‌రావు అన్నారు. బుధవారం ఆయన పాల్వంచ, ఇల్లెందులలో విలేకరుల సమావేశం నిర్వహించారు. భద్రాచలం శ్రీసీతారామ చంద్రస్వామివారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వల్ల సీతారామ ప్రాజెక్టు నీరు భద్రాద్రి జిల్లాకు రాకుండా పోయిందన్నారు. అసెంబ్లీలో తమ పార్టీ ఎమ్మెల్యేలు కాంగ్రెస్‌ను నిలదీస్తారని అన్నారు. ఏదైనా ప్రాజెక్ట్ కడితే రైతులకు మేలు జరుగుతుందని, కానీ బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కాంట్రాక్టర్లకు మేలు జరిగిందని ఆరోపించారు. కులం, మతం ఆధారంగా ఇచ్చే రిజర్వేషన్లకు తమ పార్టీ వ్యతిరేకమని అన్నారు. బీసీ రిజర్వేషన్లకు బీజేపీ కట్టుబడి ఉందన్నారు. కాంగ్రెస్‌కు చిత్తశుద్ధి ఉంటే బీసీ రిజర్వేషన్‌లో ముస్లింలను తొలగించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రజలు డబుల్ ఇంజన్ సర్కార్‌ను కోరుతున్నారని తెలిపారు. పార్టీ బలోపేతానికి నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని అన్నారు. సీపీఎం తదితర కమ్యునిస్టు పార్టీల నాయకులు బీజేపీలో చేరాలని తమతో సమాలోచనలు చేస్తున్నారని తెలిపారు. భద్రాచలంలో అంతర్భాగంగా ఉన్న ఐదు పంచాయతీలను ఏపీలో కలిపిన ద్రోహం నాటి బీఆర్ఎస్ ప్రభుత్వానిదేనని విమర్శించారు. అన్యమత సంస్థకు కేటాయించిన భద్రాచలం రామాలయానికి చెందిన ఏపీలోని పురుషోత్తపట్నం భూములను తిరిగి వెనకికి తీసుకోవాలన్నారు. భద్రాచలం పుణ్యక్షేత్రం అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. హిందువులు, దేవాలయాలపై దాడులను సహించబోమని అన్నారు. ఈ కార్యక్రమాల్లో మాజీ ఎంపీ సీతారాంనాయక్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు బైరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, నాయకులు సేనాపతి మురళీకృష్ణ, మనోహర్, తిమ్మిరి నరేంద్రబాబు, నరేష్ కొరడాల, గుగులోతు రాంచందర్ నాయక్, విమల్ జైన్, సుచిత్ర పానీ, మాధవ్ పాల్గొన్నారు.

నేటి నుంచి సమాచార కమిషనర్ల పర్యటన

సూపర్‌బజార్(కొత్తగూడెం): జిల్లాలో సమాచార హక్కు చట్టం (ఆర్టీఐ) అమలు పరిస్థితిని సమీక్షించేందుకు రాష్ట్ర ప్రధాన సమాచార కమిషనర్లు పీవీ శ్రీనివాసరావు, దేశాల భూపాల్, బోరెడ్డి అయోధ్యరెడ్డి గురు, శుక్రవారాల్లో పర్యటించనున్నారని కలెక్టర్ జితేష్ వి.పాటిల్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. గురువారం ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు అన్ని శాఖల ప్రజా సమాచార అధికారులు, అప్పిలేట్ అధికారులతో కలెక్టరేట్‌లో సమీక్షా సమావేశం నిర్వహిస్తారని పేర్కొన్నారు. మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు అప్పీల్‌దారులతో విచారణ ఉంటుందని తెలిపారు. శుక్రవారం ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు మరో విడత ఆర్టీఐ అప్పీల్ విచారణలు నిర్వహిస్తారని వివరించారు. అన్ని శాఖల పీఐఓలు, అప్పిలేట్ అధికారులు 6(1) కింద దాఖలైన ఆర్టీఐ దరఖాస్తుల రశీదులు, ప్రశ్నలు, సమాధానాలు, అవసరమైన పాయింట్ల వారీ కౌంటర్ సమాచారంతో విచారణకు హాజరు కావాలని కలెక్టర్ ఆదేశించారు.

కమనీయంగా రామయ్య కల్యాణం

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామ చంద్రస్వామి దేవస్థానంలో స్వామివారికి బుధవారం నిత్యకల్యాణం ఘనంగా నిర్వహించారు. గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవా కాలం జరిపారు. స్వామివారిని బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేనపూజ, పుణ్యావాచనం చేశారు. కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా జరిపారు.

ప్రభుత్వ పాఠశాలలను కాపాడుకోవాలి



మాట్లాడుతున్న యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు చావా రవి

అశ్వారావుపేటరూరల్: ప్రభుత్వ పాఠశాలలను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు చావా రవి అన్నారు. బుధవారం మండలంలోని నారాయణపురంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్ఎం పద్మావతి ఉద్యోగ విరమణ కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. రాష్ట్రంలో ప్రభుత్వ విద్యారంగం ప్రమాదంలో ఉందని, ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లల సంఖ్య తగ్గిపోతోందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ప్రీ ప్రైమరీ తరగతులు ప్రారంభించి, తరగతికో ఉపాధ్యాయుడిని నియమించాలని కోరారు. ఉద్యోగుల పీఆర్సీ అమలు చేసి, పెన్షనర్ల బకాయిలను విడుదల చేయాలన్నారు. గత ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించిందని, ఈ ప్రభుత్వం దానికి భిన్నంగా వ్యవహరిస్తుందని ఆశిస్తున్నట్లు చెప్పారు. సమావేశంలో ఎంఈఓలు పి.ప్రసాదరావు, కీసర లక్ష్మి, పి.కృష్ణయ్య, హెచ్ఎంలు హరిత, కొండలరావు, షాహీనా బేగం, వీరేశ్వరరావు పాల్గొన్నారు.

క్లుప్తంగా

మణుగూరులో ట్రెయినీ అసిస్టెంట్ కలెక్టర్



మణుగూరుటౌన్: అజొల్లా తయారీ విధానాన్ని పరిశీలిస్తున్న సౌరభ్‌శర్మ

మణుగూరుటౌన్: మండలంలో ట్రెయినీ అసిస్టెంట్ కలెక్టర్ సౌరభ్‌శర్మ బుధవారం పర్యటించారు. ఎంపీడీఓ కార్యాలయం, భవిత సెంటర్, ఐకేపీ, పగిడేరులోని జియోథర్మల్ ప్రాజెక్ట్‌లను పరిశీలించారు. గుట్లమల్లారంలోని రైతు వేదికలో రెవెన్యూ, వ్యవసాయం, ఇరిగేషన్, పంచాయతీ రాజ్, విద్య, గిరిజన సంక్షేమం, ఎస్సీ అభివృద్ధి, ఆరోగ్యం, మహిళా, శిశు సంక్షేమం, ప్లానింగ్, అటవీ, పరిశ్రమలు, రవాణా వంటి అన్ని విభాగాల అధికారులతో మాట్లాడారు. కార్యక్రమంలో తహసీల్దార్ నరేశ్, ఎంపీడీఓ శ్రీనివాసరావు, ఏడీఏ తాతారావు, ఐకేపీ ఏపీఎం అహ్మదుల్లా, ఏఓ లక్ష్మణ్‌రావు, ఎంపీఓ వెంకటేశ్వరరావు, ఎంఈఓ స్వర్ణజ్యోతి, కమిషనర్ ప్రసాద్ తదితరులు ఉన్నారు.

క్షుద్ర పూజల కలకలం



క్షుద్ర పూజలకు సంబంధించిన సామగ్రి

దమ్మపేట: మండలంలోని లచ్చాపురం గ్రామంలో మూడు రోడ్ల కూడలిపై క్షుద్రపూజల చేసిన ఆనవాళ్లు ఉండటం కలకలం రేపింది. బుధవారం తెల్లవారుజామున చూసిన గ్రామస్తులు భయాందోళన చెందారు. రోడ్డుపై ఓ సంచిలో చనిపోయిన నల్ల కోడి, కొబ్బరికాయలు, మట్టిబొమ్మ, పసుపు, కుంకుమ, ఉప్పు ఉన్నాయి. మంగళవారం అర్ధరాత్రి క్షుద్రపూజలు నిర్వహించిన అనంతరం సామగ్రిని రోడ్డుపై పడేసి ఉంటారని గ్రామస్తులు అనుమానం వ్యక్తం చేశారు. కాగా, ఆ సామగ్రిని అదే ప్రదేశంలో కొందరు దహనం చేయడంతో గ్రామస్తులు ఊపిరి పీల్చుకున్నారు.

ప్రేమ జంటను వేధించిన దుండగులు

రూ.60 వేలు ఇచ్చినప్పటికీ బ్లాక్‌మెయిల్

భద్రాచలంఅర్బన్: పట్టణంలోని రామాలయం పరిసర ప్రాంతంలోని ఓ ప్రైవేట్ లాడ్జిలో వసతి కోసం రూమ్ తీసుకున్న ప్రేమ జంటను వీడియో తీసి ఫేక్ ఇన్‌స్టాగామ్ ఖాతా నుంచి అందులో ఒకరికి పంపి వేధింపులకు దిగారు దుండగులు. అలా ఇద్దరి నుంచి రూ.60 వేలు తీసుకుని ఇంకా నగదు ఇవ్వాలని వేధించడంతో ప్రేమికులు పోలీసులను ఆశ్రయించారు. మంగళవారమే పోలీసులకు ఫిర్యాదు అందినప్పటికీ బుధవారం సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. కాగా, ఈ ఘటనకు సంబంధించి సదరు ప్రేమికులను వీడియో తీసిన వారిని పట్టుకుని అన్ని వివరాలు వెల్లడిస్తామని భద్రాచలం టౌన్ పోలీసులు తెలిపారు.

పాఠశాలకు తాళం వేసి నిరసన



నిరసన తెలుపుతున్న తల్లిదండ్రులు

టేకులపల్లి: మండలంలోని బొమ్మనపల్లి కాంప్లెక్స్ పరిధి జి.కొత్తతండా ప్రాథమిక పాఠశాలకు విద్యార్థుల తల్లిదండ్రులు బుధవారం తాళం వేసి ఆందోళన చేపట్టారు. నీటి సౌకర్యం ఏర్పాటు చేయాలని, ప్రహరీ గోడ నిర్మించాలని, చెత్త తొలగించాలని డిమాండ్ చేశారు. హెచ్‌ఎం పద్మ, టీచర్ పుష్పలత ఎంఈఓ జగన్‌నాయక్ దృష్టికి తీసుకెళ్లారు. మిషన్ భగీరథ అధికారులు వచ్చి నీటి సదుపాయం పునరుద్ధరించారు. ఆవరణలో చెత్తను తొలగిస్తామని కార్యదర్శి కృష్ణచైతన్య హామీ ఇవ్వడంతో తల్లిదండ్రులు ఆందోళన విరమించారు.

గ్యాస్ గోదాంను తరలించండి..

కలెక్టర్‌ను ఆదేశించిన హెచ్‌ఆర్‌సీ

భద్రాచలంఅర్బన్: పట్టణంలోని వెంకటేశ్వరకాలనీలో ఏర్పాటు చేసిన గ్యాస్ కంపెనీ గోదాం ప్రభుత్వ పాఠశాలతో పాటు నివాసాల మధ్య ఉందని, దానిని వెంటనే తరలించాలని అశోక్ నగర్ కాలనీకి చెందిన కామ అనిల్ 23 మార్చి 2022లో మానవ హక్కుల కమిషన్‌లో ఫిర్యాదు చేశాడు. కాగా, ఈ నెల 14న తెలంగాణ హెచ్‌ఆర్సీ చైర్మన్ డా.జస్టిస్ శమీమ్‌అక్తర్ సదరు గ్యాస్ గోదాంను ఆ ప్రాంతం నుంచి తరలించాలని, ఇందుకు సంబంధించి రానున్న రెండు నెలలలోపు (సెప్టెంబర్ నెలాఖరులోగా) ఆ ప్రాంతాన్ని సందర్శించి, చట్టపరంగా తీసుకోవాల్సిన చర్యలు తీసుకొని నివేదిక సమర్పించాలని జిల్లా కలెక్టర్‌ను ఆదేశించారు.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.17,463

డెయిరీకి మహర్దశ



ఖమ్మం ప్రభుత్వ పాడి పరిశ్రమ(విజయ డెయిరీ)కు మహర్దశ పట్టనుంది. డెయిరీని బలోపేతం చేసేలా సర్కారు అడుగులు వేస్తోంది. పాడి పరిశ్రమ స్థలాన్ని వాణిజ్య అవసరాలకు వినియోగించి ఆర్థిక వనరులు సమకూర్చుకోవాలని నిర్ణయించింది. అంతేగాక మరో చోట 15 ఎకరాల్లో ఇంకో పరిశ్రమను నెలకొల్పే అంశాన్ని ప్రభుత్వం పరిశీలిస్తోంది. కాగా, ప్రస్తుత ప్లాంట్‌ను రూ.2.35 కోట్లతో అధునికీకరించాలని రాష్ట్ర పాడి పరిశ్రమ శాఖ నిర్ణయించింది. – ఖమ్మంవ్యవసాయం



ఖమ్మం పాడి పరిశ్రమ ప్లాంట్

ఖమ్మం పాడి పరిశ్రమ అభివృద్ధికి ప్రణాళికలు

- వాణిజ్య అవసరాలకు ప్రస్తుత పరిశ్రమ స్థలం..
- తద్వారా విజయ డెయిరీకి ఆర్థిక పరిపుష్టి
- కొత్తగా మరొక నిర్మాణానికి ప్రతిపాదనలు

50 ఏళ్లుగా వెనుకబాటే..

పూర్వపు ఖమ్మం జిల్లాతో పాటు నల్లగొండ జిల్లా కోదాడ, సూర్యాపేట వరకు గల పాల ఉత్పత్తిదారుల, వినియోగదారుల ప్రయోజనాల కోసం 1975 లో నాటి ముఖ్యమంత్రి జలగం వెంగళరావు నగరంలోని రోటరీనగర్‌లో పదెకరాల స్థలంలో పాడి పరిశ్రమను నెలకొల్పారు. 50 ఏళ్ల చరిత్ర కలిగిన ఈ డెయిరీ అభివృద్ధిలో వెనకబడి ఉండగా, బలోపేతంపై ప్రభుత్వం దృష్టి సారించింది. ఈ క్రమంలో రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పరిశ్రమను సందర్శించి అభివృద్ధికి చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. దీంతో కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, రాష్ట్ర పాడి పరిశ్రమ ఎండీ కె.చంద్రశేఖర్ రెడ్డి, అదనపు కలెక్టర్ పి.శ్రీనివాస రెడ్డి, పరిశ్రమ జనరల్ మేనేజర్, సూపరింటెండెంట్ ఇంజనీర్(సివిల్), ఖమ్మం ప్లాంట్ డిప్యూటీ డైరెక్టర్‌లు సమావేశమై అభివృద్ధిపై చర్చించి పలు నిర్ణయాలు తీసుకున్నారు.

స్థలాన్ని సద్వినియోగం చేసేలా..

ఖమ్మం రోటరీనగర్ ప్రాంతం వ్యాపార కేంద్రంగా అభివృద్ధి చెందింది. ఈ ప్రాంతంలో పదెకరాల స్థలంలో విజయ డెయిరీ నడుస్తోంది. ఇందులో ఐదెకరాల వరకు వ్యాపార సముదాయాలు నిర్మిస్తే పరిశ్రమకు ఆర్థిక వనరులు సమకూరుతాయని అధికారులు భావిస్తున్నారు. గతంలో ఈ స్థలాన్ని బస్టాండ్‌కు అప్పగించే అంశం కూడా చర్చకు వచ్చింది. ఇటువంటి పరిస్థితులు నెలకొనడంతో ఈ స్థలాన్ని పరిశ్రమకు ప్రయోజనం కలిగేలా వినియోగించేందుకు చర్యలు తీసుకోవాలని నిర్ణయించగా.. కలెక్టర్, ఇతర ఉన్నతాధికారులు కూడా సానుకూలంగా స్పందించారు.

అభివృద్ధికి ప్రణాళికలు..

ప్రస్తుత పాడి పరిశ్రమ ఆధునికీకరణకు అధికారులు ప్రతిపాదనలు రూపొందించగా.. ఈ పనులకు రూ.2.35 కోట్లు అవసరమని రాష్ట్ర పాడి పరిశ్రమ మేనేజింగ్ డైరెక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి కలెక్టర్‌కు నివేదించారు. పరిశ్రమ నిర్వహణ, ప్రస్తుత ప్లాంటులో మార్పులు, పలు యంత్రాల ఏర్పాటుతో పాటు సివిల్ పనుల నిర్వహణకు నిధులు అవసరమని ప్రతిపాదనల్లో పేర్కొన్నారు. దీంతో పాల నాణ్యత పెరిగితే వినియోగదారుల నుంచి ఆదరణ కూడా పెరుగుతుందని అధికారులు అంటున్నారు. ఇక డెయిరీలో ఆది నుంచీ తాగునీటి సమస్య ఉంది. దీంతో ట్యాంకర్ల ద్వారా కొనుగోలు చేసిన సందర్భాలూ ఉన్నాయి. ఈ సమస్య పరిష్కారానికి ఖమ్మం కార్పొరేషన్ నుంచి తాగునీరు సరఫరా చేయాలని కమిషనర్‌ను కలెక్టర్ ఆదేశించారు. పరిసర ప్రాంతాల్లో డ్రెయిన్లు సరిగా లేక మురుగునీరు పరిశ్రమ ఆవరణలోకి వస్తుండగా దీని నివారణకు కూడా చర్యలు చేపట్టాలని సూచించారు.

పాడి పరిశ్రమ అభివృద్ధిపై దృష్టి



ఖమ్మం పాడి పరిశ్రమ అభివృద్ధిపై ప్రభుత్వం దృష్టి సారించింది. ఈ మేరకు ప్రతిపాదనలు రూపొందిస్తోంది. కలెక్టర్, రాష్ట్ర పాడి పరిశ్రమ మేనేజింగ్ డైరెక్టర్‌తో కూడిన అధికారుల బృందం పరిశ్రమ భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకొని పలు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. ఇది ఖమ్మం డెయిరీకి శుభ పరిణామం.

– కె.రవికుమార్, పాడి పరిశ్రమ అభివృద్ధి సంస్థ డీడీ

నూతన డెయిరీకి ప్రతిపాదన..

ప్రస్తుతం ఉన్న పాడి పరిశ్రమను కొనసాగిస్తూనే మరో చోట 15 ఎకరాలు పరిశ్రమకు కేటాయించి నూతన డెయిరీని నిర్మించాలని అధికారులు ప్రతిపాదనలు రూపొందించారు. ఈ అంశంపై కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి ఖమ్మం పరిసర ప్రాంతాల్లో అనువైన స్థలాన్ని గుర్తించి ప్రతిపాదనలు రూపొందించాలని అదనపు కలెక్టర్ శ్రీనివాస రెడ్డిని ఆదేశించారు. దీంతో అదనపు కలెక్టర్ ఖమ్మం ఆర్డీఓతో చర్చించి, పరిశ్రమకు అనువైన స్థలాలను గుర్తించే పనిలో ఉన్నారు.

పురోగతి లేదు..

- బీడని అవశేషాల మిస్టరీ
- రెండు నెలలు కావొస్తున్నా స్పష్టత లేదు
- ఇంకా గోప్యంగా ఉంచడంపై అనుమానాలు



అధికారులు స్వాధీనం చేసుకున్న అవశేషాలు (ఫైల్)

అశ్వారావుపేటరూరల్: అరుదైన, అంతరించిపోతున్న 'కస్తూరి జింక' అవశేషాల కేసుగా ఆరోపణలు వస్తున్న కేసులో పురోగతి లేకుండా పోయింది. నెలలు గడుస్తున్నా ఈ కేసుపై అటవీశాఖ అధికారులు స్పష్టత ఇవ్వకపోవడం, ఇంకా గోప్యంగానే ఉండడపై పలు ఆరోపణలు వినిపిస్తున్నాయి. అశ్వారావుపేట ఫారెస్టు రేంజ్ పరిధిలోని వినాయకపురం గ్రామానికి చెందిన ఓ వ్యక్తి ఇంట్లో గత మే 26వ తేదీ అర్ధరాత్రి ఫారెస్టు రేంజర్ మురళీకృష్ణ సిబ్బందితో కలిసి తనిఖీలు చేపట్టిన సంగతి తెలిసిందే. బ్యాగుల్లో దాచిన 13 అవశేషాలు గుర్తించగా.. ఇవి బంతి అకారంలో ఉండి సువాసన వస్తుండడంతో అధికారులు కస్తూరి జింక అవశేషాలుగా అనుమానించారు. వీటి ఖరీదు కూడా లక్షల్లో ఉంటుందని, సదరు వ్యక్తి వీటిని అసాంఘిక కార్యకలాపాలకు వినియోగించేందుకు సేకరించి ఉంటాడనే ప్రచారం జరిగింది. కాగా, ఈ అవశేషాలను స్వాధీనం చేసుకున్న అటవీశాఖ అధికారులు వాటిని నిర్ధారించేందుకు హైదారాబాద్‌లోని సీసీఎంబీ ల్యాబ్‌కు పంపించారు. 15–20 రోజుల్లో నివేదిక వస్తుందని, దీని ప్రకారం చర్యలు తీసుకుంటామని అధికారులు చెప్పారు. కాగా సీసీఎంబీ ల్యాబ్‌కు నిర్ధారణకు పంపించి రెండు నెలలు కావొస్తున్నా నేటికి అవశేషాలకు సంబంధించిన నివేదిక మాత్రం బయటకు వెల్లడించలేదు. దీంతో ఈ కస్తూరి జింక అవశేషాల ఘటనపై పలు ఆరోపణలు వినిపిస్తున్నాయి. అలాగే అటవీశాఖ అధికారులకు అవశేషాల గురించి సమాచారం అందించిన వారికి కుడా దీనిపై ఏ విధమైన సమాచారాన్ని ఇవ్వకపోడంపై విమర్శలు వస్తున్నాయి.

'కస్తూరి జింక' అవశేషాలు కాదా.?

ఈ కేసు సంబంధించి అటవీశాఖ నుంచి నెలలు గడిచినా స్పష్టత రాకపోవడానికి కారణాలు ఏమిటనే ప్రశ్నలు వస్తున్నాయి. హైదారాబాద్‌లోని సీసీఎంబీ ల్యాబ్ నుంచి ఇరవై రోజుల్లోపే అవశేషాలకు సంబంధించిన నివేదిక వస్తుందని, కొంతమంది అటవీ శాఖ అధికారులు చెబుతున్నారు. కానీ, నేటికీ నివేదిక బహిర్గతం చేయకపోడం చూస్తుంటే.. సదరు వ్యక్తి ఇంట్లో దొరికిన అవశేషాలు కస్తూరి జింకవి కాదని గొర్రె పోతులకు సంబంధించిన అవశేషాలుగా నిర్ధారణ అయినట్లు విశ్వసనీయంగా తెలిసింది. అరుదైన కస్తూరి జింక అవశేషాలు కాకపోవడం వల్ల ఈ కేసును అటవీ శాఖ అధికారులు సీరియస్‌గా తీసుకోలేదనే ప్రచారం సాగుతోంది. దీనిపై స్థానిక ఫారెస్టు రేంజర్ మురళీకృష్ణను వివరణ కోరగా.. అవశేషాలకు సంబంధించిన కేసుపై విచారణ సాగుతోందని, కొద్ది రోజుల్లోనే స్పష్టత ఇస్తామని తెలిపారు.

ఆత్మవిశ్వాసంతో ప్రయత్నిస్తే ఫలితం



మాట్లాడుతున్న డీఆర్‌డీఓ విద్యాచందన

ఇల్లెందురూరల్: ఆత్మవిశ్వాసంతో చేసే ఏ ప్రయత్నమైనా సత్ఫలితాన్నిస్తుందని డీఆర్‌డీఓ విద్యాచందన అన్నారు. మండలంలోని సుదిమళ్ల రైతువేదికలో బుధవారం ఆకాంక్ష మేళా నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆమె ప్రసంగించారు. రుణాల మంజూరు ద్వారా స్వయం సహాయక సంఘాలను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు చేతి వృత్తులు, కుటీర పరిశ్రమలను ప్రభుత్వం ప్రోత్సహిస్తోందన్నారు. స్థానిక లభించే ముడిసరుకులతో తయారు చేసిన ఉత్పత్తులను మూడు రోజులపాటు నిర్వహించే మేళాలలో ప్రదర్శించాలని సూచించారు. కేవలం మార్కెటింగ్ ప్రయోజనాలు ఆశించి మాత్రమే కాకుండా స్వయం సహాయ సంఘాల సభ్యుల ప్రతిభను ప్రపంచానికి చాటేందుకు ఆకాంక్ష మేళా ఉపయోగపడుతుందని తెలిపారు. అనంతరం ఆర్థికాభివృద్ధి, సంఘాల బలోపేతం కోసం కృషి చేసిన పలువురు ప్రతినిధులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సీపీఓ సంజీవరావు, ఎంపీడీఓ ధన్‌సింగ్, ఏఓ సతీశ్, డీపీఎం సమ్మక్క, డీసీసీబీ డైరెక్టర్ జనగం కోటేశ్వరరావు, మహిళా సమాఖ్యల అధ్యక్షులు తోలం శారద, అనిత, ఏపీఎంలు దుర్గారావు, అనిల్‌కుమార్, సీసీలు పాల్గొన్నారు.

పేకాట స్థావరంపై దాడి

చంద్రుగొండ: మండలంలోని బెండాలపాడు గ్రామ శివారులో పేకాట ఆడుతున్నారనే సమాచారం మేరకు బుధవారం పోలీసులు దాడి చేశారు. ఏడుగురు వ్యక్తులు, నాలుగు ద్విచక్రవాహనాలు, ఆరు సెల్‌ఫోన్లు, రూ.14,800 నగదు స్వాధీనం చేసుకున్నామని ఎస్‌ఐ శివరామకృష్ణ తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

అశ్వారావుపేటరూరల్: అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను బుధవారం స్థానిక పోలీసులు పట్టుకున్నారు. ఎస్‌ఐ యయాతిరాజు కథనం ప్రకారం.. మండలంలోని అనంతారం శివారులోని వాగు నుంచి అశ్వారావుపేట వైపు వస్తున్న ఇసుక ట్రాక్టర్‌ను స్థానిక పోలీస్ స్టేషన్ వద్ద నిలిపి తనిఖీ చేశారు. అనుమతి లేకుండా తరలిస్తున్నట్లు గుర్తించి, ట్రాక్టర్‌ను సీజ్ చేసి, వడ్డెరబజార్‌కు చెందిన ట్రాక్టర్‌డ్రైవర్ కె.వెంకటేశ్వరరావుపై కేసు నమోదు చేశామని ఎస్‌ఐ తెలిపారు.

కేసు నమోదు

ములకలపల్లి: బాల కార్మికుడితో పనులు చేయిస్తున్న ఉదంతంపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్‌ఐ రాజశేఖర్ కథనం మేరకు.. ఆపరేషన్ ముస్కాన్‌లో భాగంగా మణుగూరు సహాయ కార్మికశాఖ అధికారి నాగరాజు ఆధ్వర్యంలో మండలంలోని జగన్నాథపురంలో బుధవారం తనిఖీలు నిర్వహించారు. షరీఫ్ అనే వ్యక్తి వద్ద సిమెంట్ పనులు చేస్తున్న బాలకార్మికుడిని గుర్తించి, కుటుంబీకులకు అప్పగించారు. నాగరాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

చోరీకి గురైన బైక్ లభ్యం

అశ్వాపురం: మండలంలోని మొండికుంట గ్రామసమీపంలో రైతు లింగమల్లు పొలం వద్దనిలిపిన బైక్ నాలుగు రోజుల కిందట చోరీ చేశాడు. అందులో పెట్రోల్ అయిపోగానే బూర్గంపాడు మండలం మోరంపల్లి బంజర వద్ద సీతారామ కెనాల్ రోడ్డుపై వదిలేసి వెళ్లాడు. రెండు రోజులుగా అక్కడే ఉంటున్న బైక్‌ను స్థానికులు గుర్తించారు. అంతకుముందే సోషల్ మీడియాలో బైక్ పోయిందని రైతు లింగమల్లు పెట్టడంతో ఆయనకు ఫోన్ చేశారు. బైక్ దొరకడంతో రైతు సంతోషం వ్యక్తం చేశాడు.

సబ్ జైలును సందర్శించిన జడ్జి



రికార్డులు పరిశీలిస్తున్న జడ్జి కీర్తిచంద్రికరెడ్డి

ఇల్లెందు: పట్టణంలోని సబ్ జైలును న్యాయమూర్తి దేవరపల్లి కీర్తిచంద్రిక రెడ్డి బుధవారం సందర్శించారు. ఖైదీలకు అందుతున్న మెనూ అడిగి తెలుసుకున్నారు. రికార్డులను తనిఖీ చేశారు. ఆర్థిక స్తోమత లేని ఖైదీలకు ఫ్రీ లీగల్ ఎయిడ్ క్లినిక్ ద్వారా న్యాయవాదిని నియమిస్తామని తెలిపారు. న్యాయమూర్తి వెంట సబ్‌జైలర్ చంద్రశేఖర్, హెడ్ వార్డర్ భుజంగరావు, సిబ్బంది శ్రీనివాస్, భాస్కర్, లీగల్ ఎయిడ్ న్యాయవాది కీర్తి కార్తీక్, కోర్టు సిబ్బంది ఉన్నారు.

కుటుంబ సభ్యులు మందలించారని ఆత్మహత్య



రాము (ఫైల్)

ఇల్లెందురూరల్: మండలంలోని కొమరారం గ్రామ పంచాయతీ ట్రాక్టర్ డ్రైవర్ కుర్సం రాము (31) పురుగులమందు సేవించి బుధవారం మృతిచెందాడు. కుటుంబ సభ్యులు మందలించారన్న క్షణికావేశంలో ఇంట్లో ఎవరూలేని సమయంలో పురుగులమందు సేవించాడు. గమనించిన కుటుంబ సభ్యులు రామును ఆస్పత్రిలో చేర్పించారు. కోలుకోవడంతో మంగళవారం ఇంటికి తీసుకొచ్చారు. బుధవారం పరిస్థితి విషమించడంతో మృతిచెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కొమరారం పోలీసులు కేసు నమోదు చేశారు. మృతదేహానికి ఇల్లెందు ప్రభుత్వ ఆస్పత్రిలో శవపరీక్ష నిర్వహించారు.

రిటైర్డ్ జవాన్ ఆత్మహత్య



సుధాకర్(ఫైల్)

పాల్వంచ: పురుగులమందు తాగి రిటైర్డ్ జవాన్ ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసుల కథనం మేరకు.. పట్టణంలోని ఆదర్శనగర్‌కు చెందిన రిటైర్డ్ జవాన్ జరబన సుధాకర్ (55) మంగళవారం మధిరలో ఓ కార్యక్రమానికి సోదరులు జరబన సీతారాములు, నిమడనేని సతీశ్‌తో కలిసి కారులో వెళ్లాడు. సాయంత్రం పాల్వంచ చేరుకున్నాడు. రాత్రి వరకు ఇంటికి రాలేదు. కుటుంబ సభ్యులు ఫోన్ చేసినా లిఫ్ట్ చేయలేదు. బుధవారం తెల్లవారుజామున గట్టాయిగూడెం సమీపంలోని విద్యుత్ ఎంప్లాయీస్ కాలనీ పక్కన గల ఖాళీ స్థలంలో కారు ఆపి పురుగులమందు మృతి చెందాడు. స్థానికులు కుటుంబ సభ్యులకు సమాచారం అందించగా అతని పక్కనే పురుగుల మందు డబ్బా ఉండగా అది తాగి మృతి చెందినట్లు గుర్తించారు. మృతుడి కుమారుడు వెంకటేశ్ ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ సుమన్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గంజాయి తరలిస్తున్న వ్యక్తి అరెస్ట్



గంజాయి, నిందితుడిని చూపుతున్న పోలీసులు

భద్రాచలంఅర్బన్: ద్విచక్ర వాహనంపై గంజాయి తరలిస్తున్న వ్యక్తిని బుధవారం పోలీసులు పట్టుకున్నారు. కూనవరం రోడ్డులోని ఆర్టీఏ కార్యాలయం ఎదురుగా ఎస్‌ఐ శ్రీహరి వాహన తనిఖీలు చేపట్టారు. ఒడిశాకు చెందిన కమల్ బిశ్వాస్ ద్విచక్రవాహనంపై 11.70 కేజీల ఎండు గంజాయిని హైదరాబాద్ తరలిస్తూ పట్టుబడ్డాడు. గంజాయి విలువ రూ.7లక్షలు ఉంటుందని ఎస్‌ఐ శ్రీహరి తెలిపారు. నిందితుడిని రిమాండ్‌కు తరలించామని చెప్పారు. తనిఖీల్లో సిబ్బంది సుధీర్, వెంకట్, హరీశ్, హనుమంతరావు, ఉపేందర్ పాల్గొన్నారు.

సగానికి తగ్గిన సోలార్ విద్యుత్ ఉత్పత్తి

అంతా అస్తవ్యస్తంగా మారిన ఇల్లెందు ఏరియా సింగరేణి



ఇల్లెందు సోలార్ ప్లాంట్ ముఖ ద్వారం



సోలార్ ప్లాంట్‌లో విద్యుత్ ఉత్పత్తి చేసే ప్లేట్లు

ఇల్లెందు: రూ.కోట్లు వెచ్చించి ఏర్పాటు చేసిన సింగరేణి సోలార్ విద్యుత్ ప్లాంట్‌లో విద్యుత్ ఉత్పత్తి సగానికి తగ్గిపోయింది. ప్లాంట్‌లో పనిచేసే మూడు విభాగాల్లోని ఉద్యోగులు, కార్మికులను తొలగించారు. సోలార్ ప్లాంట్ నిర్వహణ అధ్వానంగా మారింది. ఇక్కడి సైట్ ఇంజనీర్ వెంకటేశ్ రోడ్డు ప్రమాదంలో మృతి చెంది 8 నెలలు కావొస్తుండగా ఆయన స్థానంలో మరో సైట్ ఇంజనీర్‌ను భర్తీ చేయలేదు. నిర్వహణ బాధ్యతలు చూసే సూపర్‌వైజర్ పోస్టు కూడా ఖాళీగా ఉంది. ఈనెల మొదటి వారం నుంచి కార్మికులు పనుల్లోకి వెళ్లటం లేదు. తమకు న్యాయం చేయాలని సమ్మెబాట పట్టారు. దీంతో ప్లాంట్‌లో విద్యుత్ ఉత్పత్తి సగానికి పడిపోయింది. ఇల్లెందు – కారేపల్లిరోడ్‌లో కోటమైసమ్మ ఆలయం సమీపంలో 350 ఎకరాల్లో ఏర్పాటు చేసి న విషయం విదితమే. ఈ ప్లాంట్ నిర్వహణ టెండర్‌ను ఓ సంస్థ దక్కించుకుంది. ప్లాంట్ రక్షణ కోసం 30 మంది వరకు గార్డులు పనిచేయాలి. కానీ, తొమ్మిది మంది గార్డులను కొనసాగిస్తామని చెప్పటంతో గార్డులు సమ్మె బాట పట్టారు. ఇక ఆరుగురు ఎలక్ట్రీషియన్లు, 10 మంది గ్రాస్ కట్టింగ్ కార్మికులు పనిచేస్తున్నారు. నిర్వహణ భారంగా మారిందని కార్మికులను తొలగించారు. తొమ్మిదిమంది గార్డులను కొనసాగిస్తూ రాత్రుల్లో చోరీల అదుపుకోసం విధులకు హాజరు కావాలని ఒత్తిడి చేస్తున్నారు. ఇదిలాఉండగా ఇక్కడి సీసీ కెమెరాలు కూడా సక్రమంగా పనిచేయటంలేదు. దీంతో చోరీలు పెరిగిపోయా యి. కాగా, రాత్రి సమయాల్లో తాము ఎంతకాలం విధులు నిర్వర్తించాలని కార్మికులు ఆందోళన చెందుతున్నారు. జూలై మొదటి వారం నుంచి విద్యుత్ ఉత్పత్తి సగానికి సగం తగ్గిపోయింది. ప్రతీ రోజు 1.50 లక్షల యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి జరుగాల్సి ఉండగా సగం కూడా ఉత్పత్తి జరగడం లేదని అధికారులే చెబుతున్నారు. ఈ తరుణంలో రూ.కోట్లు వెచ్చించి ఏర్పాటు చేసిన సింగరేణి సోలార్ ప్లాంట్‌లో విద్యుత్ ఉత్పత్తి నీటి మీద రాతలుగా మారింది. ఈ అంశంపై సింగరేణి సోలార్ ప్లాంట్ పర్యవేక్షక ఇంజనీర్ వీరూనాయక్‌ను వివరణ కోరగా సంస్థ నిర్వహణ లోపం వల్ల విద్యుత్ ఉత్పత్తి జరగడం లేదని, ఇది సంస్థ లోపమే తప్ప సింగరేణి లోపం కాదని పేర్కొన్నారు. విద్యు త్ ఉత్పత్తి తగ్గిపోయిన విషయం వాస్తవమేనని, కొన్ని ప్లేట్లు పని చేయడం లేదని, చాలా సమస్యలు ఉన్నాయని, మరో సంస్థకు టెండర్ అప్పగించే ప్రయత్నంలో కొంత జాప్యం సాగుతోందని పేర్కొన్నారు.

పాఠశాలకు తాళం వేసిన కాంట్రాక్టర్



తాళం వేసి నిరసన తెలుపుతున్న రాము

దుమ్ముగూడెం: మండలంలోని కె.దంతెనం గ్రామంలోని మండల ప్రజాపరిషత్ ప్రాథమిక పాఠశాలకు కాంట్రాక్టర్ రాము బుధవారం తాళం వేశాడు. ఆయన ఈ ఏడాది పాఠశాలలో అమ్మా ఆదర్శ పాఠశాల అభివృద్ధి పనుల్లో భాగంగా రూ.70 వేల పనులు చేశాడు. ఆ బిల్లుల చెల్లింపులో ఆలస్యం అవుతుండటంతో తాళం వేశానని రాము తెలిపాడు. అమ్మ ఆదర్శ పాఠశాల కింద సుమారు రూ.1.30 లక్షల పనులు చేయాల్సి ఉండగా గతంలో ఉన్నా హెచ్‌ఎం దాదాపు రూ.65వేల పనులు చేయించాడు. అందుకుగాను రూ.30వేలు అడ్వాన్స్‌గా చెల్లించారు. తర్వాత ఆ హెచ్‌ఎం బదిలీపై వేరే పాఠశాలకు వెళ్లడంతో అధికారులు రాముతో మిగిలిన పనులు పూర్తి చేయించారు. ఆ పనులకు సంబంధించిన బిల్లులు ప్రస్తుతం రూ.87వేలు అమ్మా ఆదర్శ ఖాతాలో ఉన్నాయి. రాము చేసిన రూ.70వేల బిల్లులకు ప్రస్తుత హెచ్‌ఎం శ్రీనివాస్ సంతకం పెట్టాల్సి గత విద్యాకమిటీ చైర్‌పర్సన్ అడ్డుకుంటున్నారు. ఈ విషయంపై ఈ ఏడాది మేలో రాము జిల్లా కలెక్టర్‌కు సైతం ఫిర్యాదు చేసినట్టు తెలిపాడు. అయినా సమస్య పరిష్కారం కాకపోవడంతో బుధవారం పాఠశాలకు తాళం వేశాడు. గ్రామస్తులు చేరుకుని రాముకు నచ్చజెప్పడంతో తాళం తీశాడు.

దరఖాస్తుల ఆహ్వానం

సింగరేణి(కొత్తగూడెం): డిప్లొమా, ఇంజనీరింగ్, నాన్ ఇంజనీరింగ్ డిగ్రీ పూర్తి చేసిన అభ్యర్థులకు సింగరేణిలో అప్రెంటిస్ కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జీఎం శాలేంరాజు బుధవారం ఒక ప్రకటనలో తెలిపా రు. మైనింగ్–60, ఈఈఈ–45, ఈసీఈ–20, సీఎస్ఈ–20, ఐటీ–15, మెకానికల్–45, సివిల్–20, నాన్ ఇంజనీరింగ్–200 (బీఏ–60, బీఎస్సీ–60, బీకాం–60, బీబీఏ–60, బీసీఏ–5, బీఫార్మసీ–10, డిప్లొమా–100.. మొత్తం 525 ఖాళీలు ఉన్నాయని, ఆసక్తి గల అభ్యర్థులు ఆగస్టు 8 నుంచి రిజిస్ట్రేషన్ కోసం www. nats. education. gov. inఅప్రెంటిషిప్ కోసం ww-w. scclmines. com/ apprenticeship ఆగస్టు 26 వరకు దరఖాస్తు చేసుకుని, పత్రాలను దగ్గరలోని మైన్స్ ఒకేషనల్ ట్రెనింగ్ సెంటర్ (ఎంవీటీసీ)లో ఇవ్వాలని సూచించారు.